


# భోజన చక్రవర్తి

చెరువులో స్నానం చేయటానికి భయపడే జనానికి గజఈతగాడి కథెందుకు అని తమరడగొచ్చు. కాని అత్తెసరు గిన్నెడు అన్నం ఆరుగురికి సరిపోతున్న ఈ రోజుల్లో అప్పంభొట్లు ఆహార విశేషాలు నమ్మినా నమ్మకపోయినా తెలుసుకోవటం అవసరం.

అప్పంభొట్లు పదహేనేళ్ళ వయసులో ఆమడ దూరాన ఉన్న ఓ పల్లెటూరికి పురిటి కబురు మోసుకెళ్ళాడు. చూపానని సూరమ్మ మునిమనవడు పుట్టాడన్న వార్తవిని పొంగిపోయి ఆ సందెచీకట్లో కందిపచ్చడి నూరి అప్పంభొట్లుని భోజనానికి లెమ్మంది. వడ్డించిన మొదట వాయకే నూరిన కందిపచ్చడి సొంతం అయిపోగా సూరమ్మ అటకమీంచి ఆవకాయ దించింది. నేతిగిన్నె కందిపచ్చడికే

ఖాళీ అయిపోతే ఆవకాయలోకి నూనె వడ్డించింది. మూడో కలుపుకి ఆవకాయ జాడీ అడుగంటగా. గోంగూర బాన ముందు పెట్టింది. బానలో గోంగూర అయితే కొంత మిగిలింది కాని వండిన అన్నం పూర్తవటంతో, మళ్లీ వండే ఓపికలేని సూరమ్మ, మొహమాటం విడిచి ఇహ మజ్జిగ కలుపుకో అనేసింది.

వండిన వంటంతా అప్పంభొట్లుకే వడ్డించిన సూరమ్మ మజ్జిగ తాగి పడుకుంటే నిద్రపట్టలేదు. అర్ధరాత్రివేళ ఇంట్లో ఏదో చప్పుడవుతుంటే దొంగలేమోనని దీపం పెద్దదిచేసి "ఎవర్రా అక్కడ" అని కర్ర తీసికెళితే అక్కడ అప్పంభొట్లు గిన్నెల్లో ఏవన్నా మిగిలిపోయిందేమోనని వెతుక్కుంటూ కన్పించాడు.

సూరమ్మ "నువ్వట్రా పిచ్చి సన్నాసీ! ఆకలేస్తోందిట్రా!" అని అప్పటి కప్పుడు పొయ్యి రాజేసి పిండి కలిపి రొట్టె ముక్కలు పోసిస్తే అవి తిన్న తర్వాత గురకపెట్టి నిద్రపోయాడు అప్పంభొట్లు.

మర్నాడు ఉదయం అప్పంభొట్లు ఆకలెరిగిన సూరమ్మ సోలెడు నెయ్యి పోయించుకుని, గొల్లని పిలిచి ఐదుసేర్లు పెరుగు తెప్పించి మానెడు కందిపప్పు వండి, అటకమీద ఊరగాయలన్నీ దింపి వేడివేడిగా అన్నం వడ్డించింది. ఆవకాయ నిన్ననే పూర్తయింది కనుక మాగాయ, మెంతికాయ ముక్కల పచ్చడి పప్పులో ఒకదాని తర్వాతొకటి కలుపుతూ ఖాళీ చేశాడు అప్పంభొట్లు. ఆ తర్వాత చింతకాయ పచ్చడి మీదికి లంఘించి చింతగింజలు మాత్రం మిగిల్చాడు. ఆ పైన ఐదుసేర్ల పెరుగు కలిపి అందులో నంజటానికి కారం పచ్చడి లేకపోతే, ఉట్టినున్న ఉసిరికాయ కుండ దింపించి చప్పగా ఉన్నా దాంతోనే సరిపెట్టుకుని భోజనం ముగించాడు. సంవత్సరానికి సరిపడ్డ ఊరగాయలు ఒక్కరోజులో తుడిచి పెట్టుకుపోతే పోయాయిగాని 'పిల్లాడు కడుపునిండా భోంచేశాడు' అని తృప్తి పడింది సూరమ్మ.

అప్పంభొట్లు భుక్తాయాసం తీర్చుకుని నాలుగ్గంటలవేళ బయలుదేరి తిరిగి అమరావతికొస్తుంటే ఊరుకు ముందు డొంకలో సుబ్బయ్యగారు కంగారుపడ్తూ

కన్పించారు. 'ఏవిటా కంగారు' అని అప్పంభొట్లు అడగ్గా "ఐదు బస్తాల జొన్నలున్నాయి. బండిమీదేసుకెళ్ళాల ఎడ్లని తోలుకురారా అంటే పాలేరు ఇంకా రాలేదు. వర్షమొచ్చేట్లుంది" అన్నారాయన. 'ఓస్! ఇంతేనా!' అని అప్పంభొట్లు ఉత్తరీయం నడుంకి బిగించి సరాసరి బండిదగ్గరకెళ్ళి కాడెత్తి భుజం మీదేసుకుని సర్ సర్‌న వూళ్ళోకి లాక్కొచ్చి ఆ ఐదు బస్తాల జొన్నలు అలవోకగా సుబ్బయ్యగారి వరండాలో పడేసి చేతులు దులుపుకు ఇంటికి పోయాడు.

కొంతకాలం తర్వాత సుబ్బయ్యగారు అప్పంభొట్లు తరపున పందెం కట్టాడు. రెండొందల ఆవడలు తింటాడు అని పందెం. గుళ్ళో మంటపంలో ఏర్పాటు చేశారు. జనం అబ్బురంగా రాసాగారు. పొద్దుట్నుంచి గారెలు వండి పెరుగులో వేస్తున్నారు. నాలుగు బానల పెరుగు తెప్పించారు. ఆవడంటే ఇప్పటి కాలం ఆవడా? ఒక్కొక్క ఆవడ దోసెడు వెడల్పు. రెండు అరచేతుల మందం. ఆ నాలుగ్గంటలవేళ అప్పంభొట్లు స్నానం చేసి మంటపం దగ్గర కొచ్చేసరికి జనమంతా గుమిగూడి వున్నారు. మంటపం మధ్యన బాసీపట్టు వేసుకుని పక్కకు చూస్తే నాలుగు గంగాళాల్లో మెంతిపెరుగులో తేలుతున్న ఆవడలు కన్పించాయి. వాటి మీద తిరగమోత మిరపకాయలు, కరివేపాకు కొత్తిమెర నోట నీళ్ళూరిస్తుంటే 'ఇంకెందుకు ఆలస్యం?' అన్నాడు అప్పంభొట్లు. కడిగిన విస్తరి పరిచి వరసగా వడ్డించటమేమిటి, పడేసి ఆవడ వడ్డిస్తుంటే నాలుగు నిమిషాల్లో విస్తరి ఖాళీ అవుతోంది. విస్తళ్ళు కడిగి ఇచ్చేవాళ్ళు, వడ్డించే వాళ్ళదే ఆలస్యమా అనిపిస్తోంది. మధ్య మధ్యన గొంతుజారటానికి మంచితీర్థం పుచ్చుకుంటూ చూసేంతలోనే నాలుగు గంగాళాల్లో ఉన్న రెండొందల ఆవడ మెంతిపెరుగుతో సహా అవలీలగా ఖాళీ చేశాడు. జనం ఆశ్చర్యపోయారు. అంతటితో అవలేదు. ఖాళీ విస్తరి చూపిస్తూ 'ఇంకా ఉన్నాయా'? అనడిగాడు. వంటమనిషి వచ్చిన జనానికి తలో ముక్కా ఇవ్వొచ్చని ఓ యాభై ఆవడవేసి వేరే గంగాళంలో పెట్టాడు. అది కూడా తెప్పించి పూర్తిచేసి బ్రేవ్‌మని తేన్చుకుంటూ లేచి వెళ్ళిపోయాడు అప్పంభొట్లు. జనం ముక్కున వేలేసుకుని

'పీడు హరించుకోలేడు చస్తాడు" అనుకున్నారు. అప్పంభొట్లు పార తీసుకుని సరాసరి కృష్ణకెళ్ళి అవతలొడ్డుకు ఈదుకుంటూ పోయి పారతో ఇసక తవ్వటం మొదలెట్టాడు. అలా రెండుగంటలు ఇసక తవ్వీ తవ్వీ స్నానం చేసి ఇంటికొచ్చి రాత్రికి శుభ్రంగా భోంచేసి పడుకున్నాడు.

పెళ్ళి భోజనాల్లో తలుపు వారగా కూర్చునేవాడు అప్పంభొట్లు. స్వయంగా వెళ్ళి మూడు విస్తళ్ళు కలిపి కుట్టుకుని తెచ్చి వేసుకునేవాడు. గోకర్ణంతో పప్పు తెచ్చి గరిటెతో వడ్డించబోతే "వెధవ గరిటలు తీసెయ్!" అని గోకర్ణం వొంపించేవాడు. నేతి ఝారీతో నెయ్యి వడ్డిస్తుంటే వేళ్ళ సందున ఎన్ని లోయలుండేవో తెలియదు. చేతిలో నెయ్యి కన్పించేది కాదు. ఝారీ ఖాళీ అవవలసిందే. కూరల పళ్ళాలు, పప్పుగిన్నెలు, పులిహోర పళ్ళాలు, పులుసుబకెట్లు అన్నీ అప్పంభొట్లు దాకా వచ్చి ఖాళీ అయి వెనక్కు వెళ్ళవలసిందే. ఆఖర్న లడ్డూల బుట్ట వస్తే గాలికోసం "ఉస్' అన్నట్లు ఎంగిలి చెయ్యి జాడించి ఆ చెయ్యి బుట్టకు తగలగా 'అంటయింది ఇంకెందుకు. పనికొస్తాయి' అని బుట్టెడు లడ్లు విస్తట్లో వొంపించుకునే వాడు.

అలా సాగిపోయిన అప్పంభొట్లు ఆఖరిదశలో కరువొచ్చింది. పెద్దవాడైనా జఠరాగ్ని తగ్గినా జిహ్వ చావలేదు. "మూడు వీశెల వంకాయ కొని ముచ్చెంకాయ కూర చేయించి అరసోలెడు నెయ్యివడ్డించగా నేను భోంచేస్తుంటే చూసి వినోదించేవారు శోభనాద్రిగారు. ఇప్పుడా సదుపాయం ఏదీ?'' అని విచారించేవాడు. పోతూ పోతూ అప్పంభొట్లు కొడుకుని పిలిచి చెప్పాడు. "పేరయ్యా నా తద్దినానికి మంచి తిండిపుష్టి ఉన్నవాణ్ణి భోజనానికి పిలవరా!''అప్పంభొట్లు పోయింతర్వాత పేరయ్యకి తండ్రిలాంటి తిండిపుష్టి ఉన్న వాడు కన్పించలేదు. ఉన్నా అలా పెట్టగల తాహతూ కుదరలేదు. అతని మనవలకీ మునిమనవలకీ అప్పంభొట్లు ఆహారలీలలు చెప్పకోవటమే మిగిలింది ❋